www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023
5
తిరుపతి



లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూళ్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూళ్లు చేపట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సహాయ కమిషనర్ గోవర్ధన్, ఆర్వో, ఆర్ఐలు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని వార్డు పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా పాత బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, అధిక మొత్తంలో ఆస్తిపన్ను బకాయిపడ్డవారి ఆస్తులకు సంబంధించి సత్వరం నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయిలో పన్నులు వసూళ్లు చేపట్టాలని, ఇందుకోసం ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులు రోజువారి, వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. వార్డుల వారీగా ఆస్తి పన్ను డిమాండ్, వసూళ్ల పాత బకాయిలపై సంబంధిత ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్ఐలు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిర్బంధం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్, పలమనేరు

సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కిన ఉద్యోగ ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధకాండ ప్రదర్శించడమే కాకుండా, బెదిరింపులకు పాల్పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అర్థంలేని యాప్‌ల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు. శనివారం చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అధ్యక్షతన, మధ్యాహ్నం పలమనేరు [illegible]లో నాయకులు ఓబులరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి పిడిఎఫ్ ఉద్యమ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, పి.బాబు రెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. గతంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలుగా ఉన్న వారు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, కాంట్రాక్టు కార్మికులకు బాసటగా నిలుస్తూ వారి గళాన్ని శాసనమండలిలో వినిపించారన్నారు. వారి సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. గతంలో మూడుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులను పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, మేధావులు గెలిపించడం వల్లనే వారి సమస్యలను వినిపించడానికి శాసనమండలి వేదికయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు సురేంద్ర, పి.చైతన్య పాల్గొన్నారు. పలమనేరులో నాయకులు ఓబులరాజు, భువనేశ్వరి, అన్సారి ఈశ్వర్, నాగేశ్వరరావు, చెన్నకేశవులు, సుబ్రమణ్యం, మంజునాథ్, జయంతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

సిఐటియు, ఎఐటియుసి శ్రేణులకు పిలుపు

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ/ వరదయ్యపాళెం, యంత్రాంగం

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, బాబురెడ్డిలను గెలిపించాలని సిఐటియు, ఎఐటియుసి జిల్లా నాయకులు వి.నాగరాజు, పి.మురళి పిలుపునిచ్చారు. బిఎన్ కండ్రిగలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల, కష్టజీవుల సమస్యలపై పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అభ్యర్థులు నిరంతరం పోరాడారన్నారు. గతంలో మూడుసార్లు పీడీఎఫ్ అభ్యర్థులను పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మికులు, కష్టజీవులు గెలిపించారన్నారు. శాసనమండలిలో ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై, ప్రజా వ్యతిరేక విధానాలపై తమ గళాన్ని వినిపించారన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు జనార్ధన్, కత్తిరవి, కత్తి ధర్మయ్య, ఎన్.రమణయ్య, గురవయ్య, చెంచమ్మ, షణ్ముఖ, తిరుపాలు, చిన్నగురవయ్య పాల్గొన్నారు. వరదయ్య పాళెం లోనూ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. కార్మికసంఘాలు బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు కత్తి రవి, చిన్నరాజ్, అరుణాచలం, రమేష్ బాష, తరుణ్ పాల్గొన్నారు.



వరదయ్యపాళెంలో వామపక్షాల సమావేశంలో మాట్లాడుతున్న వి.నాగరాజు

సమన్వయంతో మాస్టర్‌ప్లాన్ రోడ్లు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరాభివద్ధికి మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఏరియా డెవెలప్ రోడ్లు పూర్తి చేసేందుకు అందరూ కలిసి పని చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి నగరంలో పనులు జరుగుతున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల స్థితిగతులపై శనివారం నగరపాలక సంస్థ కార్యలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి నగరంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తి చేసేందుకు ప్లానింగ్ సిబ్బంది నిరంతరం పనులను పర్యవేక్షించాలన్నారు. తిరుపతి నగరం తూర్పు వైపు అభివద్ధి చెందాలంటే రహదారుల నిర్మాణాలు తీసుకురావాలనే లక్ష్యంతో పని చేద్దామన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన అన్నమయ్య మార్గ్, వై.ఎస్.ఆర్ మార్గ్ మాస్టర్ ప్లాన్ రోడ్ల వలన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వున్నాయని, కొర్లగుంట ప్రధాన రోడ్డు విస్తరణతో ఆ ప్రాంతం రాకపోకలకి అనుకూలంగా వుండి ఏరియా అభివద్ధికి మూలం అవుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు అమలు అవుతున్న ప్రాంతాల్లోని స్థలాలు ఇచ్చిన వారికి త్వంగా టిడిఆర్ బాండ్లను అందించేందుకు, అదేవిధంగా లీగల్ సమస్యలు వుంటె సకాలంలో పరిష్కరించేలా చూడాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాల సుబ్రహ్మణ్యం, షణ్ముగం, ప్లానింగ్ అధికారులు శారదాంబ, సాయిలీలా,జగధీష్ రెడ్డి, ధర్మరాజు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ : వీసీ



పవర్‌వాక్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ రజనీ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ విమెన్ సేఫ్టీ, మహిళా అధ్యయన కేంద్రం విభాగం, తిరుపతి దిశా పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పవర్ వాక్ నిర్వహించారు. మహిళా యూనివర్సిటీ పరిపాలనా భవనం నుండి బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం వరకు విద్యార్థులు ప్లకార్డులు, నినాదాలతో సాగిన ఈ పవర్ వాక్‌ను మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఆచార్య కే. రాజారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి మహిళలు కుటుంబానికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు దూసుకు వెళ్తున్నప్పటికీ లింగ వివక్షత కారణంగా అనేక అవరోధాలను, అడ్డంకులను, హింసను ఎదుర్కొంటూ ఉన్నారన్నారు. మహిళల పట్ల నెలకొని ఉన్న వివక్షతా పూరితమైన ధోరణులను విడనాడాలని, అన్ని రంగాలలోనూ స్త్రీ, పురుషులు ఇరువురికి సమాన హోదా, గౌరవం ప్రాధాన్యత, హక్కులు, అవకాశాలు ఉన్నప్పుడే లింగ సమానత్వం సాధ్యపడుతుందన్నారు. సమ సమాజ స్థాపన సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, స్త్రీ,పురుషుల సమానత్వం తోనే దేశ సమగ్రాభివద్ధి సాధ్యపడుతుందని తెలియజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ, ప్రొఫెసర్ సీతాకుమారి, డాక్టర్ నీరజ పాల్గొన్నారు.

బాల్య దశ నుంచే సమానత్వ ధోరణి పెంచాలి

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ కోనప్రభ తుమ్మలగుంట లోని జడ్పీహెచ్ స్కూల్ లోని విద్యార్థులకు లింగ వివక్షత పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోనప్రభ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికి లింగ వివక్షత కారణం గా జీవితంలోని అన్ని దశల్లోనూ అనేక అవరోధాలను అడ్డంకులను హింసలను ఎదుర్కొంటున్నారని అన్నారు. లింగ వివక్షతను రూపుమాపాలంటే తల్లిదండ్రులు బాల్య దశ నుంచే స్త్రీ పురుషులు ఇరువురు సమానమనే సమానత్వ ధోరణులను పెంపొందింపజేయాలని అన్నారు. లింగ సమానత్వ సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది ఇంద్రాణి , సుచరిత పాల్గొన్నారు.

11 వరకు మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడు కలు నిర్వహిస్తున్నామని, మహిళలకు మహిళా చట్టాలపై, వాటి వినియోగంపై అవగా హనా కార్యక్రమాలు నిర్వహించాలని మూడో అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు అన్నారు. శనివారం జడ్జి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వై.వీర్రాజు మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన చట్టాలు, వాటి అమలుపై గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించే దిశలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లను కలిపి టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా విశ్వ విద్యాలయాల్లోనూ, కళాశాలల్లోనూ అవగాహన కల్పిస్తామన్నారు.

ఎస్‌వీ ఆయుర్వేద విద్యార్థినికి పురస్కారం



ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఉత్తమ శోధపత్ర పురస్కారం పొందిన ఎస్‌వి ఆయుర్వేద కళాశాల విద్యార్దిని డాక్టరు టి.సిరిగీతను టిటిడి జేఈవో సదాబార్గవి శనివారం తన కార్యాలయంలో అభినందించారు. ఫిబ్రవరి 23 నుంచి 25వ తేది వరకు రాజస్తాన్‌లోని జైపూర్ రాష్ట్రీయ ఆయచుర్వేదక సంస్తాన్ మానిత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యాక్రమంలో ఔషదోత్పత్తి శాస్త్రానికి సంబందించి అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్‌వి ఆయుర్వేదిక కళాశాలకు చెందిన పిజి విద్యార్థిని డాక్టరు టి.సిరిగీత పాల్గొని కోవిడ్ 19 మహమ్మారి నివారణకు ఆయుర్వేద ఔషదాలు అనే అంశంపై పరిశోధన ప్రతం సమర్పించినదుకు ఉత్తమ శోధ పత్ర పురస్కారం లభించింది. ఈ సందర్భంగా జేఈవో ఆమెను శనివారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు మురళీకృష్ణ, డాక్టరు శ్రీదుర్గ, డాక్టరు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో యువత భవిష్యత్తు

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉద్యోగాలు లేక, ఉపాధి లేక యువత భవిష్యత్ అంధకారంలో ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. టిడిపి తెచ్చిన కంపెనీలను జగన్‌రెడ్డి నిలబెట్టి ఉంటే ఈ రెండేళ్లలో రెండు లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేవని, కానీ తరిమేశాడని విమర్శించారు. ఇదిలాగే కొనసాగితే ఏపీ యువత కేరాఫ్ అడ్రస్సు తెలంగాణా, కర్నాటక, తమిళనాడు, చివరకు ఉత్తరప్రదేశ్ కూడా అయ్యే ప్రమాదం ఉందన్నారు. యువగళం పాదయాత్ర 34వ రోజు శనివారం 14.2 కిలోమీటర్లు సాగింది. పుంగనూరు నియోజకవర్గం కొక్కువారిపల్లి విడిది కేంద్రంనుంచి పాదయాత్ర ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యింది. దేవళంపేటలో, తుదుంవారిపల్లిలో, కల్లూరులో మాటామంతీ, ముఖాముఖి నిర్వహించారు. కల్లూరులో భోజన విరామం. సాయంత్రం ముస్లీంలతో, హమాలీలతో మాటామంతీ నిర్వహించారు. జ్యోతినగర్ విడిది కేంద్రంలో రాత్రి బస చేయనున్నారు.

34రోజులుగా పాదయాత్ర చేస్తున్నానంటే యువత ఉత్సాహమే కారణమన్నారు. దుష్టపాలనను రాష్ట్రం నుంచి తరిమేయాలనే ఉద్దేశ్యంతో తాను యువగళం ప్రారంభించినట్లు చెప్పారు. ఫాక్స్‌కాన్ అనే కంపెనీ మన రాష్ట్రం నుంచి వెళ్లిపోయి తెలంగాణాకు చేరిందని, అక్కడ లో మందికి ఉద్యోగాలు ఇస్తోందన్నారు. తాజాగా కర్నాటక రాఊంతోనూ ఈ కంపెనీ ఒప్పందం చేసుకుందన్నారు. జేట్యాక్స్ కోసం వేధించి ఒక్కో సంస్థను రాష్ట్రం నుంచి జగన్‌రెడ్డి తరిమేస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడొద్దని, పోరాడిన యువతకు పెద్దపీట వేస్తామన్నారు. కుప్పం, పలమనేరుకు పరిశ్రమలు వచ్చాయని, కానీ పుంగనూరుకు పరిశ్రమలు రాలేదంటే ఎంఎల్‌ఏ పెద్దిరెడ్డికి నియోజకవర్గ ప్రజలపై ఎంత చిన్నచూపో ఆలోచించాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏపీ నుంచి పక్క రాష్ట్రానికి వలసలు వెళ్లడాన్ని అరికట్టి, పక్క రాష్ట్రం నుంచి ఏపీకి వలసలు వచ్చేలా చేస్తామన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా యువత భవిష్యత్ అంధకారంలో ఉందన్నారు. భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పిఇటి రవికిషోర్ మాట్లాడుతూ పిల్లల్లో క్రీడాస్ఫూర్తి లేదని, ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. లోకేష్ మాట్లాడుతూ బాబు విద్య, ఉద్యోగాలు తెస్తే, జగన్ పాలనలో పాఠశాలల వద్దకే గంజాయి తెచ్చారన్నారు. ఈ విషయమై తాను మాట్లాడితే తిరుపతి ఎస్‌పి భుజాలు తడుముకున్నాడన్నారు. గంజాయికి ఏపీ అడ్డాగా మారిపోయిందన్నారు. చివరకు పదో తరగతి విద్యార్థులను గంజాయి సప్లయర్లుగా మార్చేశారన్నారు. చంద్రగిరిలో ఓ యువతిని గంజాయికి బానిసగా చేశారన్నారు.



విద్యార్థి మిస్బా తల్లిదండ్రులు తన కుమార్తె ఆత్మహత్యకు కారణాలను నారా లోకేష్‌కు వివరిస్తూ

మైనార్టీలతో ముఖాముఖి సందర్భంగా పలమనేరుకు చెందిన మైనార్టీ అమ్మాయి మిస్బా వైసిపి నేతల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు వజీర్ అహ్మద్, నసీమాలు నారా లోకేష్‌ను కలిసారు. మిస్బాకు చెందిన మార్కుల లిస్టులు, డ్రాయింగ్ పుస్తకాలు, సర్టిఫికేట్లను లోకేష్‌కు చూపించారు. వైసిపి నాయకులు టీసి ఇప్పించి, తమ కుమార్తె చదువుకు అడ్డుపడ్డారని వాపోయారు. దాన్ని తట్టుకోలేకే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కన్నీరుమున్నీరయ్యారు. మిస్బాను మానసికంగా వేధించిన వైసిపి నాయకుడు సునీల్‌పై తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శిక్షిస్తామని లోకేష్ హామీ ఇచ్చి ఓదార్చారు.

'దిశ' వాహనంతో నారా లోకేష్ సెల్ఫీ

'గంజాయి మోహన్ ఇంటి దగ్గరే అంధురాలైన దళిత యువతిని గంజాయి మత్తులో ఒకడు దారుణంగా నరికేస్తే అప్పుడు దిశ పోలీసులూ, దిశ వాహనం రాలేదు. దిశ చట్టం లేకపోయినా రంగులు వేసి, పేర్లు పెట్టిన దిశ వాహానాలలో పోలీసులు ఇదిగో ఇలా నా దగ్గర మైకు లాక్కోవడానికి నా వెంట తిరుగుతున్నారు. పుంగనూరు నియోజకవర్గం కొత్తపేట దగ్గర నన్ను ఫాలో అవుతున్నారు' అని దిశ వాహనాన్ని చూపుతూ నారా లోకేష్ సెల్ఫీ తీసుకున్నారు.

నీటిశుద్ధీకరణ ప్లాంట్ పనులు పూర్తి చేయాలి



ప్రజాశక్తి– చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరానికి శాశ్వత తాగునీటి సరఫరా పథకానికి సంబంధించిన డబ్ల్యూటీపీ (నీటి శుద్ధీకరణ ప్లాంట్) నిర్మాణ పనులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పరిశీలించారు. శనివారం ఉదయం కమిషనర్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి దామలచెరువు వద్దనున్న అడవిపల్లె రిజర్వాయర్, డబ్ల్యూటీపి (నీటి శుద్ధీకరణ ప్లాంట్) నిర్మాణ పనులను పరిశీలించారు. అమత్ పథకంలో భాగంగా చిత్తూరు నగరానికి శాశ్వత తాగునీటిని సరఫరా కోసం రూ.271కోట్లతో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ఇంజనీరింగ్ అధికారులు, కేఎల్‌ఎస్‌ఆర్ ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని డబ్ల్యూటీపీ సరఫరా చేస్తారు. పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ సి.గోపాల్ రెడ్డి, డీపీహెచ్‌ఈవో పుష్పగిరి నాయక్, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎంఎల్‌సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఈ నెల 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఓ ప్రయివేట్ హోటల్‌లో జిల్లాలోని పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎంఎల్‌సి ఎన్నికలకు అన్ని విధాలుగా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, ప్రతి కేంద్రంలో ఎన్నికల నిర్వాహణ సజావుగా జరిగేందుకు కావాల్సిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాలు 8, సమస్యాత్మక కేంద్రాలు 51 కేంద్రాలుగా గుర్తించామని, ఈ పోలింగ్ కేంద్రాలతో పోలీసు బలగాలతో పాటు అదనపు కేంద్ర బలగాలను నియమించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కిడ్నీ బాధితులకు అండగా ఉంటా : మేయర్

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: కిడ్నీ భాదితులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది స్తామని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. శ్రీ వెంకటేశ్వర ఏపీ స్టేట్, కిడ్నీ పేషెంట్ హెల్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామయ్య, దాతలు మురళీధర్ బాబు ఆధ్వర్యంలో శనివారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం మేయర్ ఛాంబర్ లో మేయర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా కిడ్నీ బాధితులకు ఉచితంగా మందులు, ఇంజక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కిడ్నీ బాధితులకు ప్రభుత్వం వారు ప్రతి నెల ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా డయాలసిస్ చేస్తున్నా రని, ప్రతి నెల పదివేల రూపాయలు పెన్షన్లు అందిస్తున్నారని తెలియజేశారు. ఈ వెంకట్రామయ్య, భాస్కర్, కష్ణమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సృష్టించిన టాటా ఈవి మోటార్స్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రముఖ ఆటో మొబైల్ తయారీ సంస్థ ఈవి పరిణామానికి మార్గదర్శకులైన టాటా మోటర్స్ అత్యంత విశ్వసనీయ, డ్రివెన్ ఈవి- నెక్సాన్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు డ్రైవ్ చేయడం ద్వారా ఇండియా బుక్‌ఆఫ్ రికార్డు సృష్టించిందని ఆ సంస్థ ఎండి శైలేస చంద్ర తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సృష్టించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈవి ద్వారా అత్యంత వేగవంతమైన, కె2కె డ్రైవ్ కోసం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో ప్రవేశించడం ద్వారా నెక్సాన్‌ఈవి దాని సామర్థ్యాన్ని మరింత ధృవీకరించిందన్నారు. అతి తక్కువ వ్యవధిలో 4003 కిలోమీటర్లు డ్రైవ్ చేయడం, తమ వినియోగదారులు నిరంతరం పెరుగుతున్న చార్జింగ్ మౌళిక వసతులతో పాటు నెక్సాన్ ఈవి మెరుగైన శ్రేణితో సుదీర్ఘ ప్రయాణాలకు నమ్మకంగా నిలిచిందన్నారు. సుదీర్ఘ ప్రయాణాలకు వినియోగాదారులు వినియోగించవచ్చని వెల్లడించారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆధారపూరితంగా నిరూపించామని తెలిపారు.

వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు : ఆర్‌టిఒ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

రవాణా శాఖ ఆదేశాల మేరకు జిల్లా లోని అన్ని వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు, రిఫ్లెక్టివ్ టేప్‌లు తప్పనిసరని జిల్లా రవాణా శాఖ అధికారి సీతారామి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు అందరూ వెబ్‌సైట్‌లో హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్ల ఏర్పాటుకు స్లాట్ నమోదు చేసుకుంటే తదుపరి సమాచారం సంబంధిత వ్యక్తులకు సంక్షిప్త సందేశం వస్తుందన్నారు. ఇప్పటివరకూ నంబర్‌ప్లేట్లు లేనివారూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రభుత్వాన్ని విమర్శించినందుకేనా దాడి..?

మునిరాజమ్మకు చంద్రబాబు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

వైసీపీ ప్రభుత్వంను విమర్శించిందన్న నేపథ్యంలోనే హోటల్ నిర్వాహకురాలు మునిరాజమ్మపై కొందరు వైసీపీ నేతలు ఉద్దేశ పూర్వకంగా దాడి చేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరిలో మునిరాజమ్మకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు.

వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్ నగర్ లో వెంకటాద్రి, మునిరాజా అనే దంపతులు నివసిస్తున్నారు. వీరు బతుకుదెరువు కోసం శ్రీకాళహస్తి- పిచ్చాటూరు రహదారి పక్కనే శివనాథంపురం వద్ద టిఫిన్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గత నెల 17వ తేదీన నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా ఈ మార్గంలో వచ్చినపుడు మునిరాజమ్మ తన బాధలు చెప్పుకుంటూ సమస్యలు తీరడం లేదనీ, రాజీవ్ నగర్ లో మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ ఆయనకు విన్నవించింది. ఆ తరువాత ఈమె ఓ టీవీ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఇందులో ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. మునిరాజమ్మ మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇందుకు ఆగ్రహించిన అధికార పార్టీ నేతలు ఆమెపై దాడికి పథకం రచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గత నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల ప్రాంతంలో మునిరాజమ్మ తన దుకాణం వద్ద ఉండగా నలుగురు మహిళలు, ఒక యువకుడు అక్కడకు వచ్చారు. మొదట మునిరాజమ్మను టిఫిన్ అడిగారు. ఆ తరువాత ప్రభుత్వాన్ని విమర్శిస్తావా అంటూ నలుగురు మహిళలు ఆమెపై దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు మునిరాజమ్మ చెబుతోంది. అంతేకాకుండా తొట్టంబేడు పోలీసు స్టేషన్ కు వెళ్లి మునిరాజమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.

ప్రజాదృష్టి

సమస్యలు వింటూ... భరోసా ఇస్తూ..!

- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ముగిసిన 'యువగళం' పాదయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి యువనేత చేపట్టిన 'యువగళం' పాదయాత్ర శనివారానికి 34వ రోజుకు చేరుకుంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ముగించుకుని ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరులోకి ఈ యాత్ర అడుగు పెట్టనుంది.. జనవరి 27న కుప్పంలో ప్రారంభించిన ఈ యాత్ర అదే ఉత్సాహంతో పుంగనూరు నియోజకవర్గంలోనూ కొనసాగింది.. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అంటూ రహదారుల కూడళ్లలో యువత ద్యాన్సులు ఉత్సాహాన్ని నింపాయి.. రోజుకు 10-15 కిలోమీటర్ల దూరం యాత్ర సాగుతూ వచ్చింది. జగన్‌పైన విమర్శలు చేయడంతోనే కాకుండా, బీసీలతోనూ, మైనార్టీలతోనూ, ఆయా సామాజికవర్గాలతోనూ మమేకమవుతూ వారి సమస్యలను సావధానంగా వింటూ 'మేమున్నాం మీకు అండగా' అంటూ భరోసా ఇస్తూ యాత్ర సాగింది. ప్రారంభంలో తారకరత్నకు హార్ట్‌స్ట్రోక్ రావడం, కొన్నాళ్లు బెంగుళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొంది మృతిచెందడం వల్ల చోటుచేసుకున్న విషాదం మినహా మిగిలిన అన్ని రోజులూ నారా లోకేష్ యాత్రలో ఎక్కడా 'అలసట' అనేది కనిపించకుండా యాత్ర సాగింది. అడుగడుగునా అధికార పార్టీ అడ్డగింపులు, పోలీసుకేసులు షరా మామూలుగానే సాగాయి.

యాత్ర ఆద్యంతం ప్రతి ఒక్కరితో మమేకం అవుతూ, వారి బాధలను నింపాదిగా వింటూ, అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే ఏం చేస్తామో వివరిస్తూ యాత్ర కొనసాగింది. యాత్ర ప్రారంభంలో పెట్రోల్, డీజిల్ సంబంధించి రాష్ట్రంలో భారాన్ని సరిహద్దు ప్రాంతంలో స్వయంగా వాహనానికి పెట్రోల్ పట్టించి రాష్ట్ర ప్రభుత్వ దోపిడీని వివరించే ప్రయత్నం చేశారు. రోజా ఇంటికి 'సారె' తీసుకెళ్లేందుకు మహిళలను ఆటోలో ఎక్కించుకున్నందుకు హమీద్‌బాషా ఆటోను వైసిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో ఆటో డ్రైవర్ హమీద్‌బాషాకు కొత్త ఆటోను స్వయంగా ఇచ్చారు. నారా లోకేష్ ఎదుట వైసీపీ ప్రభుత్వంను విమర్శించిందన్న నేపథ్యంలోనే శ్రీకాళహస్తి పట్టణ రాజీవ్‌నగర్‌లో హోటల్ నిర్వాహకురాలు రజకురాలు మునిరాజమ్మపై కొందరు వైసీపీ నేతలు ఉద్దేశ పూర్వకంగా దాడి చేసి ఎదురు కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం మంగళగిరిలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని బాధితురాలికి అందజేశారు. శనివారం కల్లూరులో మైనార్టీలతో ముఖాముఖి సందర్భంగా పలమనేరుకు చెందిన విద్యార్థి మిస్బా తల్లిదండ్రులు వజీర్ అహ్మద్, నసీమాలు నారా లోకేష్‌ను కలిసారు. వైసిపి నాయకుల వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ స్పందిస్తూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మిస్బా ఆత్మహత్యకు కారణమైన వైసిపి నాయకుడు సునీల్‌ను శిక్షిస్తామన్నారు. నారా లోకేష్ పాదయాత్ర ఆద్యంతం బీసీలు, మైనార్టీలతో మమేకమవుతూ కనిపించారు. టిడిపి మళ్లీ అధికారంలోకి వస్తే ఆదరణ పథకాన్ని పునఃప్రారంభిస్తామని, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించి, ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులతో మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణా, గోడావరి జలాలను తెప్పించి ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. ఉచితంగా డ్రిప్ ఇరిగేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ తీసుకురావాలని స్వయంగా నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం గమనార్హం.



మత్స్యకారులతో...

లీడ్' స్కూల్స్‌లో మెరుగైన అభ్యాసన


ప్రజాశక్తి-తిరుపతి సిటి: రాష్ట్రంలో లీడ్ పవర్డ్ స్కూల్స్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరం కోవిడ్ సంబంధిత సవాళ్లు ఉన్నా సరే సుమారు 20 శాతం విద్యార్థుల అభ్యాసన ప్రక్రియ మెరుగ్గా ఉందని లీడ్ కోఫౌండర్, సిఈవో సుమీత్ మోహతా తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి పట్టణాల్లోని స్కూల్స్‌లో మార్పులు సాధించడం ద్వారా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువస్తూ, దేశంలోని మెట్రోలు పెద్ద నగరాలకు, పట్టణాల మధ్య ఉన్న విద్యా అంతరాన్ని లీడ్ తగ్గిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా తమ లీడ్ ఇంటిగ్రేటడ్ స్కూల్ సిస్టమ్ ద్వారా స్కూల్స్‌కు సాధికారిత అందించడంతో మార్పు తీసుకొచ్చేందుకు తాము కృషి చేస్తున్నామని, ఈ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన భాగమన్నారు. రాబోవు ఐదు సంవత్సరాల్లో 60వేల స్కూళ్లలో రెండున్నర కోట్ల మంది స్టూడెంట్స్‌ని చేరుకునే తమ లక్ష్యంలో భాగంగా ఈ రాష్ట్రంలో తమ ఉనికిని పెంచుకోవడంపై దృష్టి సారించామన్నారు. విశాఖపట్టణం భారతీయ విద్యాభవన్ ప్రిన్సిపాల్ షింపి మాట్లాడుతూ 1994లో వైజాగ్‌లో ఏర్పాటైన బారతీయ విద్యాభవన్ నేడు రాష్ట్రంలో అగ్రగామి స్కూల్స్‌లో ఒకటిగా నిలిచిందన్నారు. ఆధునిక పాఠ్యప్రణాళిక, సృజనాత్మకత, సాంకేతికలను సమ్మిళితం చేయడంతో తమ విద్యార్థులను భవిష్యత్‌కు సిద్దం చేసేలా విశ్వాసం పెంపొందించామన్నారు. అభ్యసన లక్ష్యాలు, వనరులు తగినస్థాయిలో అందించినపుడు స్టూడెంట్ అభ్యసన ఫలితాలు ఆటోమెటిక్‌గా అభివృద్ధి చెందుతాయన్నారు. లీడ్ అందించే టీచర్ ట్రైనింగ్ మాడల్స్, లెసన్ ప్లాన్స్, క్లాస్‌రూమ్ మెనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఈ తరహా మార్పులు వస్తున్నాయన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరు ఎస్‌విఎస్‌ఎన్ స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థి రోహిత్ మాట్లాడుతూ తమ స్కూల్లో ఆంగ్లభాషాభివృద్ధికై ఎలీగా అనే ప్రోగ్రామ్‌ను లీడ్ ప్రవేశపెట్టిందన్నారు. ఇందులోని ఐదు కంపోనెంట్స్ ద్వారా తాము ఆంగ్లాన్ని ఒక నైపుణ్యంగా నేర్చుకుంటున్నామని తెలిపారు. దీని ద్వారా ఎంతో సులువుగా ఫోనిక్స్ ఉపయోగించి పదాలను రాయడం, చదవడం నేర్చుకుంటున్నట్లు తెలిపారు.

వైఎస్ఆర్ బీమా సాయం పంపిణీ



ప్రజాశక్తి-కోట: గూడలి పంచాయతీ పరిధిలోని దక్షిణపాలెంలోని చెంచయ్య ఇటీవల మృతిచెందారు. దీంతో శనివారం సచివాలయ సిబ్బంది వైయస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, గూడలి వైస్ ప్రెసిడెంట్ విజయసారథిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.జ్యోతి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎండాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మార్చి నెల ప్రారంభంలోనే భానుడి ప్రతాపంతో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోందని.. ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని బుచ్చినాయుడు కండ్రిగ వైద్యాధికారి డాక్టర్ దివాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రతంగా ఉండటంతో ప్రజలు తగినంత నీరు తాగాలని, వేడిగాలుల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు రాకూడదని.. ఒత్తిడితో కూడిన పనులకు దూరంగా ఉండాలని, చెప్పులు లేకుండా బయటకు రాకూడని తెలిపారు. అత్యవసర సమయంలో సచివాలయ పరిధిలో ఉండే నర్సులను సంప్రదించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరి వైద్యం చేసుకోవాలని వివరించారు.

నవధాన్యాలతో రైతులకు సిరులు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు పంచాయతీ పరిధిలో నవధాన్యాల ప్రకతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు పండించే పంటలు అధిక దిగుబడి పొంది లాభాలు రావాలంటే పంట వేసే ముందు 24 రకాల విత్తనాలు రుతుపవనాలు రాకముందు ఏప్రిల్, మే నెలలో నవధాన్యాల విత్తనాలు భూమిలో చల్లటంతో భూమి సారవంతం చెందుతుందన్నారు. వేసిన పంట చీడపీడల రోగాలు బారిన పడకుండా అధిక దిగుబడి వచ్చి రైతులు లాభాలు పొందుతారని ప్రకతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. దీనిపై మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు ప్రకతి వ్యవసాయ సిబ్బంది గౌతమి, సుధాకర్, శ్రీధర్, దేవసేనమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పిచ్చాటూరు: కీళపూడిలోని పాల సేకరణ కేంద్రాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధనంజయలు శనివారం తనిఖీ చేశారు. పాలలో వెన్న, నీటి శాతాన్ని పరిశీలించారు. ల్యాబ్‌లో వినియోగించే వస్తువుల పరిశుభ్రత, యంత్రాల నాణ్యతను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించి లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారా లేదా ఆరా తీశారు. అనంతరం పశువులకు టీకాలు వేశారు. టీకాల కారణంగా ఉపయోగాలపై పాడి రైతులకు వివరించారు.



కాపు సంక్షేమసేన మహిళా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర కాపు సంక్షేమసేన అధ్యక్షులు, మాజీ హోమ్ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కాపు సంక్షేమసేన మహిళా విభాగ ఉపాధ్యక్షురాలిగా మలిశెట్టి లక్ష్మిని నియమించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన జోగయ్యకు, కాపు సంక్షేమ రాష్ట్ర యువసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 36 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో విజయ సాధన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్ మాట్లాడుతూ విజయ సాధన స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థులు ఉపయోగించుకొని పదో తరగతిలో మంచి మార్కులతో పాసవ్వాలని కోరారు.



పారిశ్రామిక అభివృద్ధికి బీజం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు సంబంధించిన ఎల్లో మీడియా పరిపాలన దక్షుడు కాదని కథలుగా ప్రచారాలు చేస్తున్నాయని, శుక్రవారం విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సు ద్వారా రెండు లక్షల అంచనాతో సమ్మిట్‌ను నిర్వహిస్తే 13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓఏలు కుదుర్చుకోవడం జరిగిందని, ఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి బీజం పడిందని వైసీపీ తిరుపతి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆరే అజయ్ కుమార్ తెలిపారు.



శ్రీకాళహస్తిలో 'బియ్యపు' కుటుంబ పాలన

- హాని జరిగితే ఎమ్మెల్యేదే బాధ్యత
- నాపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి
- వైసీపీ మాజీ పట్టణాధ్యక్షుడు కొట్టెడి మధుశేఖర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుటుంబ పాలన సాగుతోందని, నిజమైన వైసీపీ కార్యకర్తలకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందంటూ ఆ పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు కొట్టెడి మధుశేఖర్ ఆరోపించారు. కొట్టెడి మధు శేఖర్ స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శనివారం కుటుంబ సమేతంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను వైసీపీకి, వైఎస్ కుటుంబానికి నిజమైన విధేయత కల్గిన కార్యకర్తనన్నారు. 1994లోనే 'వైఎస్సార్ యువసేన'ను స్థాపించి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డే స్వయంగా వైఎస్సార్ యువసేనను ప్రారంభించారని గుర్తు చేశారు. వైఎస్సార్ మరణానంతరం ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి కోసం ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు తలపెట్టినట్లు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి వైసీపీని స్థాపించినప్పుడు అప్పటి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బియ్యపు మధుసూదన్‌రెడ్డి అభ్యర్థన మేరకు పార్టీలో చేరానని, దాదాపు ఆరేళ్లపాటు పట్టణాధ్యక్షుడిగా పార్టీకి ఎనలేని సేవలు చేశానని గుర్తు చేశారు. అయితే 2019 ఎన్నికల ముందు తనకు అవమానాలు ఎదురు కావడంతో టిడిపిలో చేరినట్టు చెప్పారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేగా మధుసూదన్ రెడ్డి ఆహ్వానం మేరకు తిరిగి సొంత గూటికి చేరానని వివరించారు. అయినా తనపై ఆయన వైఖరి ఏ మాత్రం మారలేదన్నారు. తనకిస్తామన్న పదవి, కేటాయిస్తామన్న కాంట్రాక్టు పనులు ఏవీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నాలాగే వివక్షకు గురైన ఓ వైసీపీ సీనియర్ నేతతో కలిసి ప్రజా సమస్యలపై పోరాడినందుకు తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని వాపోయారు. ఈ దాడి ఘటనపై స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి సదరు నిందితులపై కేసు నమోదు చేయించారని, అయితే నాలుగు నెలలు గడిచిపోతున్నా ఇప్పటివరకు వారిని అరెస్టు చేయలేదని మండిపడ్డారు. అంతేకాకుండా తనపై మరో మారు దాడి చేసేందుకు కుట్ర జరుగుతోందని, తనకు.. కుటుంబ సభ్యులకు హాని జరిగితే ఎమ్మెల్యేనే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తామంతా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బియ్యపు మధుసూదన్ రెడ్డి బొజ్జలపై కుటుంబ పాలన ఆరోపణలు చేయించారని, మరి ప్రస్తుత ఎమ్మెల్యేగా బియ్యపు చేస్తున్న పాలన ఏంటని ప్రశ్నించారు. తండ్రితో పాటు తనయలూ పాలన సాగిస్తున్నారని, భార్యా అత్తమామలదీ అదే దారన్నారు. నాయుడుపేటకు చెందిన ఓ వ్యక్తి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. పార్టీ కోసం ఒక్కరోజూ కష్టపడని ఓ వ్యక్తికి (డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం), కనీసం పార్టీలో చేరకుండానే ఎమ్మెల్సీ పదవి అప్పజెప్పడం దేనికి సంకేతమన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, లక్షలు దారబోసుకున్న నిజమైన కార్యకర్తలను విస్మరించడం కాదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీసుకుంటున్న నిర్ణయాలు హేతుబద్ధంగా లేవని, అవి కాస్త కాపులను, బీసీలను పార్టీకి దూరం చేసేలా ఉన్నాయని హెచ్చరించారు. ఇకనైనా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నిజమైన కార్యకర్తలకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హితవు పలికారు.



గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశులు మాట్లాడుతూ బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చి ప్రజలపైన భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ప్రజలపై భారం మోపడం, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, పురుషోత్తం, గోవిందస్వామి, సీపీఎం నాయకులు యాసిన్ బాషా, కేఆర్ సుబ్రహ్మణ్యం పిళ్లై, మోసెస్, రమేష్, ఆటో వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జూనియర్ సివిల్ జడ్జి లీలా శ్యామ్ సుందరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళా చట్టాలపై అవగాహన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి ముందుకు నడవాలని తెలిపారు. మహిళలపై హింసాత్మక ఘటనలు జరగడం చోచనీయమన్నారు. భారత రాజ్యాంగంలోని 15వ అధికరణ మహిళలకు రక్షణ కల్పిస్తోందని..ఫోక్సో చట్టంతో మహిళలకు లైంగిక హింస నుంచి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో పద్మజ, సూపర్వైజర్లు గీతాంజలి, కిరణ్మయి, భారతి, కృష్ణవేణి, రోజా రమణి, అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయని, జిల్లాలో 152 పరీక్షా కేంద్రాల్లో 28,412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని.. ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటసారిగా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని.. ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్ష పత్రాలు ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల, బాలాజీ కాలనీలోని స్ట్రాంగ్ రూమ్ లో ఈనెల 19 నుంచి భద్రపరచడం జరుగుతుందని, ఇదే క్యాంపస్ లో స్పాట్ వాల్యుయేషన్ ఉంటుందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ పదో తరగతి హాల్ టిక్కెట్ కలిగిన విద్యార్థులను ఉచితంగా పరీక్ష కేంద్రాలకు వెళ్లేలా అనుమతించాలన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పబ్లిక్ ఎగ్జామ్స్ జరుగనున్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆనందరెడ్డి, తిరుపతి అదనపు మున్సిపల్ కమిషనర్ సునీత, ఆర్టీవో సుబ్రమణ్యం, ఖజానాశాఖ అధికారి ప్రసాద్, ఏపీఎస్పీడీసీఎల్ డీఈ శ్రీనివాసులు, పోలీస్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి తిరుపతి టౌన్: స్థానిక రెడ్డి రెడ్డి కాలనీలోని శ్రీ సాయిసుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శ్రీ రాళ్లపల్లి రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 50 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిలేష్, డాక్టర్ నవీన్, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, సుజాత, పార్వతి, సతీష్, సోమశేఖర్, మహేష్, సిస్టర్ గీతిక తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-కోట: కోట మండలంలో పలు పంచాయతీల్లో 2020-21 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు చెందిన రికార్డులను శనివారం స్థానిక మండల కమ్యూనిటీ భవనంలో పరిశీలించారు. తిన్నెలపూడి, ఊనుగుంటపాళెంలోని పనుల్లో అవకతవకలు జరిగినట్లు సీఆర్పీలు చెబుతున్నారు. రికార్డుల నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సెర్ప్ ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరించాలని ఆ సంఘం రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు ధనంజయరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో తిరుపతి జిల్లా సెర్ప్ ఉద్యోగులతో కలిసి ఉద్యోగుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపికైన సెర్ప్ ఉద్యోగుల సర్వీస్ ను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ 23శాతం, ప్రమోషన్లు, పూర్తి వేతనంపై ఈపీఎఫ్ అంశాలకు సంబంధించి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించాలని కోరారు. సమావేశంలో ఏపీ సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు టి. ధనంజయ రెడ్డి,ఉపాధక్షులు టి.శ్రీనివాసులు ఏపీడీ ప్రభావతి, ఐబీ డీపీఎం మాధవి యూనియన్ ఈసీ సభ్యులు, డి. సి. గంగయ్య, సింగన్న జిల్లాలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన మహీధర్ సాయి

ప్రజాశక్తి-కోట: ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు మేరిగ మురళిని కోట మండలం కేశవరం పంచాయతీ కి చెందిన వైసీపీ యువ నాయకులు గంపల మహీధర్‌సాయి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంపల మహీధర్ సాయి మాట్లాడుతూ ఇలాంటి మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని కోరుకుంటున్నానని తెలిపారు.



గిరిజన దంపతులకు ఆర్థికసాయం



ప్రజాశక్తి-కోట: శ్యామసుందరపురం మెయిన్ రోడ్డు వద్ద పోలు వెంకటేష్ మహాలక్ష్మి అనే నిరుపేద గిరిజనులు చిత్తుకాగితాలు ఏరుకుంటుండగా చలించిపోయిన కర్లపూడి కిషోర్ శనివారం దుప్పట్లు, దుండ్లు, ఆహార పదార్థాలు అందించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు తమవంతు సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో తమ మిత్రబృందంచే అభాగ్యులకు అండగా ఉంటామని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందరరావు దాతత్వంతో గమళ్లపాలెంలోని ఓం సాయిరామ్ ఛారిటబుల్ ట్రస్ట్ వసతి గహంలోని వృద్ధులకు శనివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కలికి జనార్దన్‌రెడ్డి, ఛైర్మన్ బి.దశరథరామి రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని పొయ్య గ్రామంలో ఆదివారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజిఎం హాస్పిటల్స్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరాన్ని పొయ్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో స్వరూపానందేంద్ర సరస్వతి



ప్రజాశక్తి తిరుమల: తిరుమల శ్రీవారిని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. శనివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఈవో ధర్మారెడ్డి ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

భారతీయ కళలకు ఆదరణ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: భారతీయ కళలను విదేశీయుల సైతం సాధన చేసి ప్రదర్శించడం అభినందనీయమని బసవరాజు భాస్కర్ రాజు పేర్కొన్నారు. శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సంఘం అధ్యక్షులు నాట్యాంజలి కార్యక్రమాన్ని తిరుపతి గోవింద ధామం వ్యవస్థాపకులు టెంకాయల దామోదరం, సంస్కార ఫౌండేషన్ అధ్యక్షులు రాజేశ్ కుమార్, సతీశ్ కుమార్‌తో పాటు భాస్కర్‌రాజు ప్రారంభించారు. నృత్యకారిణి జూలియా గుసెవా కూచిపూడి నత్యం ప్రదర్శనలు చేశారు. వేదవ్యాస కళాశాలల ప్రతినిధులు బాల సరస్వతి, నారాయణ బాబు, సభ్యులు శాలువాలతో సత్కరించారు. విశ్రాంత ఎంఈవో రవిశంకర్ భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్య, అరుణాచలం, మురళీ, రామచంద్రరాజు, శంకరయ్య, వెంకటకష్ణ, చంద్రశేఖర్ వర్మ, రామమూర్తి , మేకల సుబ్రమణ్యం, వెంకటకృష్ణమనాయుడు, పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు పురుషోతం, జిల్లా బాధ్యులు శంకర్, యుగంధర్ రాజు, కృపావరమ్మ , నిర్మలా జ్యోతి పాల్గొన్నారు.

గాజులమండ్యంలో చోరీ

ప్రజాశక్తి-రేణిగుంట: గాజులమండ్యంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు శివానంద ఆచారి ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. భార్యభర్తలు ఇద్దరూ తిరుపతిలోని ఆసుపత్రిలో ఉండటంతో దొంగలు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉచిత చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత చలివేంద్రాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అటు వాహనదారులకు, ఇటు పాదచారులకు అనుకూలంగా ఉండే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సిరాజ్ బాషా, ఆటో స్టాండ్ నాయకులు షేక్ జుమ్లేశా, వార్డ్ కన్వీనర్ షేక్ ఫజల్, షాను షఫీ, షమీర్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీలోకి టీడీపీ వలసలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైసీపీలో చేరారు. వీరిలో మాజీ ఎంపీటీసీ ఓసురు కృష్ణప్ప మొదలియార్ అలియాస్ వరదయ్య తోపాటు సుమారు 50 మంది కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో ఏర్పేడు మండల వైసీపీ ఇన్‌ఛార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, తిరుపతి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు డి.జె. సుధీర్ కుమార్, వైస్ సర్పంచ్ కందనూరు మణి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు తరుగు జయప్రకాష్, వార్డు మెంబర్లు ఏడం మోహనకష్ణ, సురకాని లింగయ్య, ఆస్తిని హేమాద్రి, శివ, వెంకటముని, రాజీవ్, వంశీకృష్ణ, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ కోసం ప్రార్థనలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కార్వేటినగరంలోని హజరత్ షబ్బర్ ఔలియా దర్గాలో నారా లోకేష్ కోసం శనివారం ముస్లిం సోదరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారా లోకేష్ పాదయాత్ర విజయవంతంగా జరగాలని, గాలి భాను ప్రకాష్ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని ప్రార్థనలు చేపట్టారు. రాష్ట్ర మైనారిటీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షాకీర్ అలీ, చిత్తూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే షబ్బర్ , గంగాధర నెల్లూరు నియోజక వర్గం బీసీసెల్ అధ్యక్షులు రవి యాదవ్, చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.సందాని,నగరి నియోజకవర్గం తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.హమీద్ బాషా, కార్వేటినగరం మండలం ఉపాధ్యక్షులు సోము, మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు వీ.కే. సాబిర్, ఉపాధ్యక్షులు కే.ఎస్.జిలానీ బాషా, షర్ఫుద్దీన్, ఇర్ఫాన్ బాషా, షబ్బీర్ బాషా పాల్గొన్నారు.



పూణే మెట్రో ప్రాజెక్ట్-3కు ఆల్‌స్టోమ్ మెట్రో రైళ్లు

ప్రజాశక్తి-సత్యవేడు: ప్రయాణ సాధనాల తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా లిమిటెడ్, పూణే మెట్రో ప్రాజెక్ట్-3 కోసం మెట్రో రైళ్లను సరఫరా చేసేందుకు ఆర్డర్ పొందింది. దీనికోసం శుక్రవారం శ్రీసిటీ పరిశ్రమలో లాంఛనంగా ఉత్పత్తి ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పూణేలో బాలేవాడి మీదుగా రాజీవ్ గాంధీ ఇన్ఫోటెక్ పార్క్‌ను శివాజీనగర్ కు కలుపుతుంది. త్వరలో ఆల్‌స్టోమ్ 'మేడ్ ఏ శ్రీ సిటీ' మెట్రో రైళ్లు ఈ మార్గంలో పరుగులు తీస్తాయి. 23 స్టేషన్లతో కూడిన 23.3 కి.మీ ఈ కారిడార్, కొత్త మెట్రో రైల్ పాలసీ ప్రకారం భారతదేశంలో మొట్ట మొదటి మెట్రో ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ కోసం 3 పెట్టెలతో కూడిన 66 మెట్రో రైళ్లను ఆల్‌స్టోమ్ తయారు చేస్తుంది. ఇప్పటికే పూణేలో ప్రాజెక్ట్ లలో భాగంగా మెట్రో రైళ్లు, ఇతర యంత్ర పరికరాలు సరఫరా చేసిన ఆల్స్టాం కు పూణే నగరంలో ఇది 3వ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ డెవలపర్ అయిన పూణే సిటీ మెట్రో రైల్ లిమిటెడ్ (పిఐటిసిఎంఆర్ఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ కపూర్ లాంఛనంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించి శ్రీసిటీలో మెట్రో రైళ్ల ఉత్పత్తిని ప్రారంభించారు. పూణే మెట్రో లైన్ 3 ప్రాజెక్ట్ 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు ఆదర్శవంతమైన ఉదాహరణ అని, ప్రధాని నరేంద్ర మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' విధానాన్ని ఇది బలోపేతం చేస్తుందనడంలో మాకు ఎలాంటి సందేహం లేదని అన్నారు. పిఐటిసిఎంఆర్ఎల్ డైరెక్టర్ నేహా పండిట్, పిఐటిసిఎంఆర్ఎల్ బిజినెస్ సిస్టమ్స్ హెడ్ ఎల్.ఎన్.ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ సైనీ, ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.